# గుర్తింపు

## యం. ఉమామహేశ్వరరావు

గుమ్మం దగ్గర నించున్న ఆ అపరిచిత వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. ఇదివరకు ఎప్పుడూ అతన్ని చూసినట్లు గుర్తులేదు నాకు. నన్ను చూసి ఓ చిన్న చిరునవ్వు అతని పెదాలమీద ప్రత్యక్షమైంది.

''నా పేరు రమణమూర్తి. లలితానగర్ నుంచి వచ్చాను. కథ రచయిత శివనారాయణగార్ని అర్జంటుగా కలుసుకోవాలి. ఆయన్తో మాట్లాడాలి'' అన్నాడు నా వంక చూస్తూ. మనిషి సన్నగా వున్నాడు. పరిస్థితుల ప్రభావమేమో డీలా పడ్డట్టుంది వాలకం.

''లోపలకు రండి'' అంటూ లోపలకు ఆహ్వానించి కుర్చీ చూపించాను. కూర్చున్నాడు ఇల్లంతా కలియజూస్తూ. రచయితలుండే ఇల్లు ఇలాగే వుంటుందా అన్నట్లుగా చూస్తున్నాడు.

''ఇప్పుడే వస్తానుండండి'' అని లోపలకు వచ్చాను. వంట గదిలో ఏదో పని చేసుకుంటోంది నా అర్ధాంగి ప్రసన్న.

''ఎవరో వచ్చినట్లున్నారు?'' ప్రశ్నించింది.

''ఆ... ఎవరో రమణమూర్తి అని పేరు చెప్పాడు. రచయిత శివనారాయణగార్ని కలుసుకోవాలని, ఆయనతో మాట్లాడాలని అట'' అన్నాను ప్రసన్న వంక చూస్తూ. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ నావంక చూసింది.

''నీ భావం నాకర్థమైంది ప్రసన్నా. రచయిత శివనారాయణ మీరేకదా అని అనబోతున్నావు కదా. నేనే ఆ శివనారాయణ అని చెప్పలేదు. కానీ వచ్చినతన్ని మాత్రం కుర్చీలో కూర్చుండబెట్టి ఇలా వచ్చాను'' అన్నాను.

వస్తున్న నవ్వును ఆపుకుందుకు ప్రయత్నిస్తోంది ప్రసన్న.

''చాలా గొప్ప పనే చేసార్లెండి. వెళ్లండి రచయితగారు. వెళ్లి ఆయన మీ గురించి ఏం పని మీద వచ్చారో కనుక్కోండి. ఎవరో ముక్కూ ముఖం తెలియని పరాయి వ్యక్తిని ఇంట్లో కూర్చోబెట్టి ఇలా వచ్చేస్తారా?'' అంది కసురుకున్నట్లు ముఖంపెట్టి.

ఇక తప్పలేదు నాకు. మళ్లా హాల్లోకి వచ్చాను. నన్ను వెదుక్కుంటూ వచ్చిన ఆ వ్యక్తి ఇల్లంతా కలియజూస్తున్నాడింకా. నేను రావడంతో నావంక తిరిగాడు. ఆ ముఖంలో ఎన్నెన్నో ప్రశ్నలు కదులుతున్నాయి.

''ఇప్పుడు చెప్పండి రమణమూర్తిగారూ! మీరు మాట్లాడదల్చుకున్న రచయిత శివనారాయణని నేనే'' అన్నాను.

ఆశ్చర్యపోయాడు. నమ్మలేనట్లుగా చూసాడు.

''నేను రచయితలా కనబడ్డంలేదాండీ?'' జోక్‌గా అన్నాను. అతను నవ్వేసాడు.

''సారీ అండీ. మీతో పర్సనల్‌గా కొన్ని విషయాలు మాట్లాడాలి. ఇప్పుడు కుదుర్తుందా?'' అన్నాడు రమణమూర్తి.

కొందరు రచయితలు వ్రాసిన రచనల్ని చదివిన తరువాత ఆ రచయితల్ని వ్యక్తిగతంగా కలుసుకున్నప్పుడు ఒక్కోసారి నిరాశ పడాల్సి వస్తుంది. అందుకు కారణం ఆ రచయితలు అందంగా లేరని కాదుగానీ ఆ రచయితలు తమ రచనలలో చెప్పే విషయం, వ్రాసే విధానంలో చూపే ప్రతిభ, కథలో వల్లించే ఆదర్శాల్లాంటివి వాళ్ల జీవితంలో గోచరించకపోవడమేనంటారు డాక్టర్ సంజీవ్‌దేవ్.

రమణమూర్తిని గమనిస్తున్న నాకు ఇదే స్ఫురించింది. బహుశా నా రచనల్ని చదివి ప్రభావితుడై నన్ను కలుసుకుందామని వచ్చి ఇలా నిరాశ చెందాడేమో! అతి సాధారణమైన ఇల్లు, మరీ సాధారణమైన జీవితం నాదని ఈపాటికి తెలుసుకుని ఉంటాడు.

''ఏదో పర్సనల్ విషయం అన్నారు. ఆగిపోయారేం? చెప్పండి'' అన్నాను.

''మీరు నాకో ఉపకారం చేయాలి. మీరైతేనే నాకు న్యాయం జరుగుతుంది. లేకపోతే నేనన్యాయమైపోతాను'' ఆ చివరి మాట పలికేటప్పుడు అతని గొంతు సన్నగా వణికింది. గుండెలనిండా దుఃఖం నిండి ఉందని అతని స్వరాన్నిబట్టి తెలుస్తోంది.

> గౌరవం, గుర్తింపు మాట ఎలా వున్నా ఒక్క చిక్కు మాత్రం అప్పుడప్పుడు ఎదురౌతుంది నాకు. మీ ఆయన కథలు వ్రాస్తారటగా. నేనో కథ వ్రాసాను. ఆయనకు చూపించాలని వచ్చాను. కాస్త రికమెండ్ చేద్దురూ అంటూ రోజూ మీరు లేనప్పుడు, మీరున్నప్పుడూ వచ్చే అమ్మాయిలతో తలనొప్పి భరించలేకపోతున్నాను. మీరు కథలు వ్రాయడం కాదుకానీ ఏ సమయంలో కథ పేరు చెప్పి ఎవరు మిమ్మల్ని ఎగరేసుకుపోతుందోనని బెంగగా వుంది.

మళ్లా అతనే అన్నాడు ''నాతో మీరోసారి మా ఇంటికి రావాలి. ఇంటికి వస్తే అన్ని విషయాలూ మీకే బోధపడతాయి. ప్లీజ్! కాదనకండి'' గబుక్కున కుర్చీలోంచి లేచి నా రెండు చేతులూ పట్టుకున్నాడు రమణమూర్తి.

ప్రఖ్యాత జర్మనీ రచయిత హెర్మన్ కేజర్లింగ్ రచనల్లో మనకు కనిపించే వెలుగులుకన్నా ఎక్కువగా ఆయన జీవితంలోని వెలుగులే ప్రత్యక్షమవుతాయట. నేనూ రచయితనేగానీ హెర్మన్ కేజర్లింగ్‌లాగ ప్రఖ్యాత రచయితను కాను. నా రచనల్లో ఏ వెలుగులూ లేకపోవచ్చును. ఉన్నా అవి నా జీవితంలో ప్రతిఫలించకపోవచ్చును. నాలో ఏం చూసి ఆ రమణమూర్తి ఒక రచయితగా నన్ను తనింటికి రమ్మని ఆహ్వానిస్తున్నాడో అర్థం కాలేదు నాకు. అతన్లో పైకి చెప్పుకోలేని ఏదో బాధ ఉంది. అందుకే అతనితో కలసి అతనింటికి వెళ్లాలనే నిశ్చయించుకున్నాను.

• • •

''ఈమె నా భార్య ప్రతిమ''

కాస్త పొట్టిగా, లావూ, సన్నంగాగాక మధ్యస్థంగా ముచ్చటగొలిపే ప్రతిమలాగానే చామనఛాయతో ఉందామె. ఆమెను నాకు పరిచయం చేసాడు రమణమూర్తి.

నమస్కరించాను. ఆమె కూడా నమస్కరించింది కళ్లు పెద్దవి చేసుకుంటూ.

''వీరు శివనారాయణగారు ప్రతిమా! నువ్వు చెప్పిన రచయిత శివనారాయణగారు వీరే. మనింటికి తీసుకు వచ్చాను'' అన్నాడు రమణమూర్తి.

ఆమెలో ఒక్కమారుగా ఏదో వింత మార్పు కనిపించింది. ఎక్కడాలేని ఆనందం ఆ కళ్లల్లో మెరుపులు కన్పించసాగాయి.

''కూర్చోండి సార్'' సోఫాలో నన్ను కూర్చుండచేసి తానూ కూర్చున్నాడు రమణమూర్తి.

''ఉండండి కాఫీ కలిపి తెస్తాను'' లోపలకు కదిలిందామె వద్దని వారిస్తున్నా వినకుండా.

''ఇంతకీ నన్నెందుకు పిలిచారో చెబుతారా?'' మెల్లగా అడిగాను రమణమూర్తిని.

గొంతు సవరించుకున్నాడతను.

''శివనారాయణగారూ! అసలు విషయం ఏమిటంటే మా శ్రీమతి ప్రతిమకు రచనలన్నా, ముఖ్యంగా కథలన్నా, ఆ కథల్ని వ్రాసే రచయితలన్నా విపరీతమైన అభిమానం. అసలు కథ వ్రాయడమనేది గొప్ప కళ అని, వ్రాసేవాళ్ళు చాలా గొప్పవాళ్ళు అని, సమాజంలో వాళ్లకెంతో గౌరవం ఉంటుందని ఆవిడ అభిప్రాయం'' ఆగాడు క్షణంపాటు.

నిశ్శబ్దంగా వింటున్నాను. మళ్లా చెప్పసాగాడు.

''ఈ మధ్యనే మా ప్రతిమకు ఓ ఆలోచన వచ్చింది. ఈ సమాజంలో కథలు వ్రాసే రచయితలకున్న గౌరవమే ఆ రచయితల భార్యలకు వుంటుందని, రచయిత

భార్య తంత్రో అంతా అభిమానించి గౌరవిస్తారనీ అంటుంది. అంతేకాదు, ఓ మామూలు గుమస్తానైన నన్ను వెంటనే కథలు వ్రాయడం ప్రారంభించమని, అలా చేయకుంటే నానుంచి విడాకులు తీసుకుంటానని కరాఖండిగా చెప్తోంది'' అన్నాడతను ఏడుపు నిండిన స్వరంతో. పరిస్థితి పూర్తిగా అర్థమైంది నాకు.

భర్త కథా రచయిత అయినంత మాత్రం చేత ఆ భార్యకు కూడా సమాజం గౌరవం ఇస్తుందా? ఇవ్వచ్చు. ఇవ్వకపోవచ్చు. రచయిత బాగా పేరున్నవాడైతే ఆ భార్యక్కూడా గౌరవం వుంటుంది. భర్త మామూలు రచయిత అయితే గుర్తింపు వుండొచ్చు గానీ ప్రత్యేకించి గౌరవించడానికి ఎవరూ సిద్ధపడరు.

ఇక ప్రతిమ విషయమే తీసుకుంటే...

తన భర్త సాధారణ గుమస్తా కావడం వల్ల తనను ఎవరూ గుర్తించలేదన్న భావన, ఆ భావన తోటే అతనో పెద్ద రచయిత అయితే తనకు మంచి గుర్తింపు వుంటుందన్న ఆశ ప్రతిమలో చోటుచేసుకున్నాయి. ఇది ఒక కారణం అయితే, మరో కారణం ఉంది. తనకు బాగా తెలిసిన ఎవరైనా స్నేహితురాలి భర్త రచయిత కావడం, అందువల్లనే ఆ స్నేహితురాలుకు మంచి గుర్తింపు ఉండడం తెలిసి ఉండాలి. అందుకే ప్రతిమ అలా కోరి ఉండవచ్చును.

రమణమూర్తి పరిస్థితి చూసి చాలా జాలి వేసింది. ఆ మధ్యనే ఓ రోజు రాత్రి మా ఆవిడ నాతో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.


''ఎంతసేపూ అలా ఆ కథలు వ్రాస్తూ రాత్రిళ్ళు మేలుకుని ఉండిపోవడమేనా? అందువల్ల మీ ఆరోగ్యం ఏదో ఒక రోజు దెబ్బ తినకమానదు.

అయ్యో రచయితగారూ! కాస్త తొందరగా వ్రాత ముగించి నిద్ర పొండి.''

ఆ మాటలకు ప్రసన్న వంక చూసి నవ్వుతూ అన్నాను–

''నేను రచయితను కావడంవల్ల నీకు కూడా మంచి గౌరవం, అందరూ నిన్ను ప్రత్యేకంగా గుర్తించడం జరుగుతోంది కదా. ఏం? నీకు ఆ గుర్తింపు అక్కర్లేదా?'' నవ్వేసింది ప్రసన్న.

''గౌరవం, గుర్తింపు మాట ఎలా వున్నా ఒక్క చిక్కు మాత్రం అప్పుడప్పుడు ఎదురౌతుంది నాకు. మీ ఆయన కథలు వ్రాస్తారటగా. నేనే కథ వ్రాసాను. ఆయనకు చూపించాలని వచ్చాను. కాస్త రికమెండ్ చేద్దురూ అంటూ రోజూ మీరు లేనప్పుడు, మీరున్నప్పుడూ వచ్చే అమ్మాయిలతో తలనొప్పి భరించలేకపోతున్నాను. మీరు కథలు



వ్రాయడం కాదుకానీ ఏ సమయంలో కథ పేరు చెప్పి ఎవరు మిమ్మల్ని ఎగరేసుకుపోతుందోనని బెంగగా వుంది. అంతేకాదు, మీ ఆయన ఫలానా కథలో హీరోయిన్‌ను అలా చేసేరేంటి? అనో ముగింపు ఇలా ఇచ్చారేమిటి అనో నన్ను నిలదీస్తున్నారు. మీరు వ్రాస్తున్న కథలు నాకు గుర్తింపునిస్తున్నా ఆ గుర్తింపు ఒక్కోసారి నాకు శాపమవుతోంది. నా బాధ ఎవరితో చెప్పుకోవాలి మహానుభావా!''

నా ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ కాఫీ కప్పుల శబ్దం సుతారంగా విన్పించింది. ఉలిక్కిపడి అటు చూసాను. చిరునవ్వుతో ప్రతిమ నుంచుని ఉంది.

''కాఫీ తీసుకోండి'' ట్రేలో రెండు కప్పుల కాఫీ తెచ్చి ఒకటి నాకిచ్చి మరోటి రమణమూర్తికి అందించింది.

''నాకో ఉపకారం చేయాలి మీరు'' అడిగాడు రమణమూర్తి. 'అడగండి' అంటూ తలూపాను.

''నాకు కథలు వ్రాయడం నేర్పాలి మీరు'' అన్నాడతను. అతని ముఖంలోకి చూసాను. ప్రత్యేకంగా ఏ భావములేదు. ప్రతిమ మాత్రం నావంక ఆసక్తితో చూస్తోంది నేనేమంటానో అని.

కథలు వ్రాయడం అంటే అదేదో ఫలానా వంట ఎలా చేయాలనో, ఫలానా ఆట ఎలా ఆడాలనో అని అడిగినట్లుంది. దాన్లోని సాధక బాధల్ని చెబితేనన్నా వాళ్ళ ప్రయత్నం మానుకోవచ్చును. లేదా తనలాగా కథా రచయితగా మరొకర్ని తయారు చేయడం ఇష్టం లేక నేను వెనకడుగు వేస్తున్నానని భావించవచ్చును.

''బడి పిల్లలకు అక్షరాలు నేర్పించడానికి ముందుగా అఆలు దిద్దించినట్లుగా మీకు నేను అక్షరాలు నేర్పవలసిన అవసరంలేదు కనుక ఓ ప్రాబ్లమ్ తీరిపోయింది. ఇక ముందుగా మీరు ఏ విషయం వ్రాయాలనుకుంటున్నారో అది మీ భాషలో, మీ శైలిలో వ్రాసి నాకివ్వండి. అది ఒక సంఘటన కావచ్చు. ఒక సంభాషణ కావచ్చు. ఒక



## జాగ్రత్తపెట్టుకో!

కిష్టుడు ఏడుస్తూ ఇంటికి వచ్చాడు.

''ఎందుకేడుస్తున్నావురా?'' అని బామ్మ అడిగింది.

''కుతుబ్‌మీనారు ఎక్కడుందిరా-' అని మాస్టారడిగారు. నాకు తెలియదన్నాను. అందుకు కొట్టారు బామ్మా!'' అన్నాడు కిష్టుడు బిక్కమొహంతో.

''ఏడవకు బాబూ! ఇక నుంచయినా ఏమీ తెలియదనకుండా నీ వస్తువులు నువ్వు జాగ్రత్తపెట్టుకో!'' అంది ఆ బామ్మ.

## అరవటం ఆపు

''అరవటం ఆపు! నీ పన్ను పీకటం నేనింకా ప్రారంభించనేలేదు'' అన్నాడు పేషంటుతో డెంటిస్టు.

''నాకు తెలుసండీ! కాని, మీ బూటుతో నాకాలు తొక్కేస్తున్నారు. అందుకని.''

## సూపర్‌బ్రెయిన్

ఒరోజున ఒకే కారులో ఒక మెకానికల్ ఇంజినీరు, ఒక ఎలక్ట్రికల్ ఇంజినీరు, ఒక కెమికల్ ఇంజినీరు, ఒక కంప్యూటర్ ఇంజినీరు ప్రయాణం చేస్తున్నారు. హఠాత్తుగా కారు ఆగిపోయింది.

''రాడ్ విరిగిపోయినట్టుంది'' అన్నాడు మెకానికల్ ఇంజినీరు.

''ఊహు! పెట్రోలు అందటంలేదనుకుంటా!'' అన్నాడు కెమికల్ ఇంజినీరు.

''కాదు. ఇగ్నీషన్ సరిగాలేదు!'' అన్నాడు ఎలక్ట్రికల్ ఇంజినీరు.

అంతాకల్సి నువ్వేమంటావన్నట్టు కంప్యూటర్ ఇంజినీరువైపు చూసారు.

అతనిలా అన్నాడు- ''ఫార్మేట్ అండ్ రీ లోడ్!.. అంటే ఓసారి మనమంతా కారు దిగి.. తర్వాత లోపలకెక్కుదాం.''

**- తటవర్తి రామచంద్రరావు** (న్యూఢిల్లీ)

వింత కావచ్చు. సబ్జెక్టు ఏదైనా ఫర్వాలేదు. ఆ కథను నేను చదివి మార్పులు చేర్పులు అవసరం అయితే చెప్తాను. ఆ తరువాత పత్రికలకు పంపిద్దురుగానీ. మీరు వ్రాసిన కథ తప్పక అచ్చవుతుంది. మీ శ్రీమతిగారికి కూడా మీపై అభిమానం, గౌరవం పెరుగుతుంది'' అన్నానో లేదో ఆశ్చర్యంగా చూసాడు రమణమూర్తి.

ఇక్కడ ప్రముఖ రచయిత కీర్తిశేషులు గోపీచంద్ చెప్పిన ఓ రెండు మాటలు చెప్పాలి.

''రచయితల్లో రెండు రకాల వాళ్లుంటారు. పరిస్థితులకు రియాక్టయి వ్రాసేవాళ్ళు, పరిస్థితులకు అతీతంగా వ్రాసేవాళ్ళు అని. కళ్లముందు జరిగిన సంఘటనకు ప్రతిస్పందించి వ్రాసేవాళ్ళు పరిస్థితులకు రియాక్టయి వ్రాసేవాళ్ళ క్రిందకు వస్తారు. వీటన్నింటినీ చూసి వీటికతీతంగా ఏవేవో మార్గదర్శక సూత్రాలను ఉటంకిస్తూ వ్రాసేవాళ్ళు పరిస్థితులకు అతీతంగా వ్రాసే వాళ్ళ కోవలోకి వస్తారు.''

కథలు ఎలా వ్రాయాలీ అన్నదానిపై ఇంకా అనేక విషయాలు చెప్పవచ్చును. గురుడు బెంబేలెత్తిపోయి ఈ కథలు వ్రాయడం నేర్చుకునేకన్నా ఏ కాశీకో పోయి సన్యాసం పుచ్చుకోవడం సులువన్న నిర్ణయం తీసుకుంటే చికాకే.

రమణమూర్తి ముఖంలో ఆనందం, ప్రతిమలో సంతోషం కనిపిస్తున్నాయి. రమణమూర్తి పరిస్థితి చూసాక ఓ చిన్న ఆలోచన మెరుపులా తట్టింది.

రమణమూర్తి భార్య ప్రతిమకు నా శ్రీమతి ప్రసన్న చేత ఓ రచయిత భార్యగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, పొందే అనుభూతుల్ని చెప్పించాలి. దాంతో ప్రతిమకు పట్టిన ఈ గుర్తింపు పిచ్చికి బ్రేకులు పడవచ్చును. ఇందుకు ప్రసన్నే సరైన వ్యక్తి.

ఆలోచన ఆపి రమణమూర్తి వంక చూసాను.

''రమణమూర్తిగారూ! మీ దంపతులిద్దర్నీ నేనో చిన్న రిక్వెస్టు చేయాలనుకుంటున్నాను. వచ్చే ఆదివారం నాడు మీ ఇద్దర్నీ మా ఇంటికి ఆహ్వానిస్తున్నాను. తప్పక వచ్చి మా ఆతిథ్యం స్వీకరించాలి'' అన్నాను. సరేనని తలూపాడు రమణమూర్తి. ప్రతిమ కూడా సంతోషంగా అంగీకరించింది.

''తప్పకుండా వస్తామండీ. ముఖ్యంగా మీ శ్రీమతిగారిని చూసే భాగ్యమూ మాకు కలుగుతుంది'' అంది ప్రతిమ.

నవ్వొచ్చింది నాకు.

• • •

''చాలా గొప్ప పనే చేసుకొచ్చారు. ఇంతా చేసి వాళ్లిద్దర్నీ మనింటికి ఆహ్వానించారన్న మాట. ఇంతవరకూ బాగానే వుందగానీ ఆ ప్రతిమగారికి నాతో ఇంటర్వ్యూ ఏమిటి? ఏమిటీ కొత్త మలుపు మహాశయా?'' ప్రశ్నించింది ప్రసన్న.

''అక్కడే వుంది అసలు మలుపు. ఓ రచయిత భార్యగా నువ్వు పొందుతున్న గుర్తింపు ఎలా వుంటుందో తెల్సుకుందామని ఆవిడ ఆశ పడుతోంది. నన్నడిగితే ఆవిడ్నే అడిగి తెలుసుకో తల్లీ అన్నాను. ఇక వ్యవహారం పూర్తిగా నీమీదనే ఆధారపడి వుంది'' చెప్పవలసినదంతా చెప్పి నా గదిలోకి నడిచాను.

''ఈయన లేనిపోని తలనొప్పి తనకు తెచ్చుకోవడమే కాకుండా నాకూ తలనొప్పి తెప్పిస్తున్నారు'' మూలిగింది ప్రసన్న.

• • •

ఆ మరుసటి ఆదివారం రమణమూర్తి, అతని భార్య ప్రతిమ మా ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనాలు చేసి సాయంత్రం వరకూ ఉండిపోయారు. కావాలనే ఆడవాళ్లిద్దరినీ ఇంట్లో ఉంచేసి మేమిద్దరం వీధిలోకి నడిచి అలా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. ఓ గంట దాటాక చీకటి పూర్తిగా పడకముందే వాళ్లిద్దరూ లలితానగర్ వెళ్లిపోయారు. వెళ్ళేటప్పుడు చూసాను. రమణమూర్తి కళ్లల్లో ఏదో తృప్తి కనిపిస్తున్నా ప్రతిమలో ఏ భావమూ కన్పించలేదు. వచ్చినప్పుడున్న ఆనందం వెళ్ళేటప్పుడు లేదు ఆమెలో.

ఓ పదిరోజులు గడిచిపోయాకగానీ రమణమూర్తి దగ్గర నుంచి ఉత్తరం రాలేదు నాకు. దాదాపు అరఠావు సైజున్న ఉత్తరం అది.

''ప్రముఖ రచయిత, గౌరవనీయులు శివనారాయణగారికి నమస్సులతో రమణమూర్తి వ్రాయునది.

ఎందరో రచయితలు సైతం చేయలేని పనిని మీరు, మీ శ్రీమతిగారు ఎంతో సులభంగా నెరవేర్చి నా బాధకు పుల్‌స్టాప్ పెట్టినందుకు మరోసారి నమస్సులు.

గత ఆదివారం మేమిద్దరం మీ ఇంటికి వచ్చినప్పుడు మీ శ్రీమతి ప్రసన్నగారు మా ఆవిడకు ఏం చెప్పారో, ఏం చేసారో తెలియదుగానీ నా జీవితాన్ని ఊహించని మలుపు తిప్పారు. గత కొద్దిరోజులుగా కథ(వ్రా)యడం గురించి, కీర్తి, గుర్తింపు అంటూ నన్ను రాచి రంపాన పెట్టిన నా శ్రీమతి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తలేదు. ఎలాగైనా ఓ కథ వ్రాస్తానేయ్ ప్రతిమా... అంటేనే చాలు అంతెత్తు లేచి కేకలు పెడుతోంది. ఇంత మార్పు ఒకేసారి ఎలా వచ్చిందో? మీ శ్రీమతిగారేం చేసారో నాకు అర్థంకాలేదు. అందుకే వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉంటాను. వీలు చూసుకుని మిమ్మల్ని మరోసారి కలుసుకుంటాను. శలవ్.

మీ రమణమూర్తి.''

ఆ ఉత్తరం చదివాక నోటివెంట మాటలు రాలేదు నాకు. ఓ సంసారాన్ని నిలబెట్టేమన్న ఆనందంవల్లనో, లేక రచయితల భార్యలు పడే బాధల్ని భూతద్దంలో చూపి భయపెట్టడంవల్ల వాళ్లల్లో కలిగిన మార్పుకో తెలియదు. కానీ ఒక్క విషయానికి మాత్రం ఎంతో సంతోషం కలిగింది నాకు. ఆ రమణమూర్తి భార్య ప్రతిమ జీవితంలో ఎన్నడూ భర్తనుంచి విడాకులు కోరదుగాక కోరదు.

★

